# వెలలేని ముత్యం

రచన :

రూపాబాయి మోతీలాల్

'చిప్పలోనబడ్డ చినుకు ముత్యంబాయె....' అన్న వేమనపద్యాన్ని మా అమ్మాయి వసంత వల్లెవేస్తుంటె నా తమిళ మిత్రుని వుత్తరం గుర్తుకొచ్చింది. చినుకు ముత్యమవుతుందో లేదో కాని, చిప్పలోముత్యం వుత్పత్తి కావడమెమో నిర్వివాదాంశం.

నా తమిళ స్నేహితుడు తూత్తుకుడిలో (టూటికోరినో) జరిగేముత్యాల వేటను చూడరమ్మని నాల్గు సంవత్సరాలుగా వ్రాస్తూనే వున్నాడు. ఈసారి తీరిగ్గా వెళ్ళి ఆ పరిశ్రమ ఎలాటిదో చూడాలన్న నిశ్చయానికి వచ్చి ఆ రాత్రే టూటికోరిన్ ఎక్స్‌ప్రెస్ యెక్కాను.

తూత్తుకుడి చేరిన మర్నాడు, నా స్నేహితుడు కుమార్ ముత్యాల పరిశ్రమను ప్రత్యక్షంగా చూచే వీలు కల్గించాడు. చిన్నయంత్రపు పడవలో కుమార్, మరి కొందరూ, నేనూ, ప్రయాణం చేశాం. పడవషికారు అదే ప్రథమం కాబట్టి నాలోయేదో ఉల్లాసము భయము కలిగాయి, పడవ, కెరటాలను చీల్చుకుంటూ గంభీరంగా ముందుకు సాగుతోంది, కుమార్ ముత్యాలవేట గురించి వివరిస్తున్నాడు.

'తూత్తుకుడి సముద్రంలో చేపలు పట్టడమే కాకుండా శంఖలు, నత్తలు, ముత్తెపు చిప్పలు ఏరే పరిశ్రమ కూడా ఆదినుండి నేటివరకూ సాగుతూనేవుంది. పడవల్లో కూచొని వలవిసిరి చేపలు పట్టేంత సుళువైన పనికాదు. ఈపనికి ప్రత్యేకమైన కృషి, అనుభవమే కాక ప్రాణాన్ని లక్ష్యంచేయని మొండిధైర్యం కూడా వుండాలి ఇది ఒకవిధమైన భయంకర పరీక్షే!'

'భయంకరమైందని తెలిసి కూడా యీపనిలోకి దిగుతారా?' అని నా సందేహాన్ని వెలిబుచ్చాను. 'దిగడమేమిటి? సముద్రంలో దూకడం! చూడబోతున్నాంగా,




ఈ భయంకర పరిశ్రమలో చాలా అనుభవస్తులు తూత్తుకుడి పడవరో అనే తెగవారు. ఇప్పట్లో వీరిమతం క్రైస్తవమైనా భరత కులస్థులనే వీళ్ళని వ్యవహరిస్తారు. సముద్ర గర్భంలో యాభై అడుగులనుండి యెనభై అడుగుల లోతుల్లో చిన్నచిన్న పర్వత శ్రేణుల్లాంటి రాతీ షాయలుంటాయి. ఈ రాతిగుట్టలకు ముత్తెపు చిప్పలు అంటుకొని జీవిస్తాయి. ముత్తెపు చిప్పలను చలనంలేని ఒకవిధమైన స్థావర ప్రాణిగా పరిగణించవచ్చు.'

'అయితే వాటికి కదలికే లేదా?'

'కదలికలేదని కాదు కానీ చేపల్లాగ, నత్తలాగ ఈది పోలేవు వున్నచోటినుండే చిప్ప నోరుతెరచి వీటిలోని పొచి, పురుగులు, చిన్నచిన్న జీవాలను ఆహారంగా సంపాదించుకోగలదు. ఆలాటి సమయాల్లో ఏదోఒక దృఢపదార్థ చిప్పలోని సున్నితదేహంలో చొచ్చుకొని బాధ కల్గించినప్పుడు స్రవించే జిగురు ద్రవమే గట్టిపడి ముత్యంగా మారుతుందంటారు.'

'చిన్నప్పుడు చదివిన పాఠమే!' అన్నాను నేను.

'ముత్యాలవేటను తమిళంలో 'ముత్తు కుళిత్తల్' అంటారు. అంటే ముత్యాల మునుగుడు అని నీళ్ళలో మునిగి తీసుకరావడం వల్ల ముత్యాల మునుగుడైంది. బాగా అలవాటుపడ్డ బెస్తల సహాకారంతో ప్రభుత్వం ఈ పరిశ్రమను పూనుకుంటుంది. ఇరవై ఏడేళ్ళకు పూర్వం బ్రిటిష్ సర్కార్ హయాంలో జరిగిన పరిశ్రమ స్వతంత్రభారత సర్కార్ అధ్వర్యాన మళ్ళీ 1955 వ సంవత్సరంలో ప్రారంభించ బడింది. అప్పటినుండి సంవత్సరానికి ఒకపర్యాయం, వరుసగా మూడు నెలలు సాగుతుందీ వృత్తి, ఈ నవీన యుగంలో కూడ ప్రాచీన కాల పద్ధతిలోనే ముత్యాల చిప్పల సేకరణ జరగడం ప్రశంసనీయం.'

'ఆపద్ధతి ఎలాటిదో వివరించండి,' అన్నాను అదుర్దాతో.

'అదో-ఆలా చూడండి!....అన్నాడు కుమార్. అపుడే మా పడవ ఆగిపోయిన విషయం గమనించాను, మాపడవకు కొద్ది దూరంలో ముప్పై పడవలకు పైగానే పడవల వ్యూహంలాగ విన్యాసానికి సిద్ధమైనట్లు గోచరించాయి. ముత్యాల మునుగుడు ఉత్సాహంతో జరుతున్న దని పడవల్లోని మనుష్యులను పరికరాలను చూపించాడు కుమార్.


రైళ్లలో సుఖప్రయాణం.

ప్రజావసరములైన బొగ్గు, ఆహారధాన్యాలు, గృహనిర్మాణ పరికరాలు మున్నగువాటిని రైళ్లు రవాణా చెయ్యవలసి వున్నందున, ప్రయాణీకుల రద్దీని వారించడం రైల్వేలకు దుర్ఘటమే అవుతున్నది. ఏమైనప్పటికీ, దేశ విస్తృతంగా రైలుప్రయాణం చేసే కోటానుకోట్ల ప్రయాణీకులకు సుఖంగా వుండడానికి రైల్వే అధికారులు సాధ్యమైనన్ని విధాల కృషిచేస్తూ వున్నారు. సాధ్యమైనంతవరకు రైలు రవాణాను ఉపయోగించుకోవడమే దేశానికి శ్రేయస్కరం.

దక్షిణ రెల్వేచే జారి చెయ్యబడినది.

యునైటెడ్ కెమికల్ డైమండ్ వర్క్సు
ఫ్యాక్టరి
మధుర రోడ్డు
తిరుచినాపల్లి
కార్యాలయము
129 పెద్దబజారు
తిరుచినాపల్లి
UNITED CHEMICAL
DIAMOND WORKS
ELECTRIC DIAMONDS
చంద్రా క్వాలిటి వజ్రములు
ఆభరణములకు
ప్రసిద్ధి చెందినవి
అన్నివూళ్లలో షరాబుష్యాపారులవద్ద దొరకును.
నమ్మకమైన
సీల్ లాట్లు
ప్రొప్రయిటర్లు!
మోతి. S. రాజగోపాల్ శెట్టి.
N. ఆదినారాయణ శెట్టి.
M. S. క్రిష్ణమూర్తి శెట్టి.
N. రంగరాజులు నాయుడు.

'ఈవృత్తిలో దిగే వారు ముందుగా శ్వాసం బిగపట్టు డానికి అలవాటు చేసుకొంటారు. ముత్యాల చిప్పలను ఏరేవాళ్ళను 'కుళిఆళ్' అంటారు. అంటే మునిగే వాడని అర్థం. మరికొందర్ని 'తోడయన్' అంటారు ఈతోడ యన్ల సహాయంతోనే చిప్పలు ఏరేవాళ్ళు సముద్రంలో మునుగుతారు. అదో....ఆవైపు చూడండి!....' అని పడవలకేసి చూపించాడు కుమార్.

చూచాను. లావైన త్రాడుమొనకి లింగాకారమైన రాతిగుండు కట్టబడివుంది. ఆరాతి గుండులో కాలు దూకేంత ద్వారంవుంది. చూస్తుండగానే ఒకడు రాతి బండలో కాలుదూర్చి త్రాడుని బలంగా రెండు చేతులలో పట్టుకొన్నాడు. శ్వాసం బిగబట్టి వున్నట్లే వుహించు కొన్నాను. తోడయన్ గబగబా ఆమనిషిని బావిలో ముంచే చెంబులాగ సముద్రంలో ముంచేసి రెప్పపాటులో వుత్తతాడుని తోడేశాడు.

'మునిగిన మనిషి ఏమైనట్లు?' అన్నాను కంగారుగా.

'ఏమైనాడో చూడు!....'

ఆతురత, ఆశ్చర్యం, భయం ఏకసమయంలో నన్నా వరించాయి. పాపం! మునిగి చనిపోయాడేమో! అని పశ్చాతాప పడుతున్న సమయంలో మునిగిన మనిషి హఠాత్తుగా నీళ్ళమట్టంపైకి తేలి పడవలోకి యెక్కుతున్నాడు! క్షణకాలం నాకండ్లను నేనే నమ్మలేక పోయాను నా భ్రాంతిని గమనించిన కుమార్....

'ఆశ్చర్యంగా వుందా?....మునిగిన మనిషి సముద్ర పుటడుగు చేరగానే రాతిలోని కాలుని విడిపించుకొంటాడు ఆ సమిజ్ఞను తెలుసుకొన్న తోడయన్ త్రాడుని తోడేస్తాడు నీళ్ళలో మునిగిన మనిషికీ, తోడయన్‌కి యెలాటి సహాయ సంబంధమూలేదు. మునిగిన మనిషి శ్వాసం బిగబట్టగల కాలంలో గుట్టలకు అంటుకొని వున్న ముత్తెపు చిప్పలను కోసి మొలనున్న సంచిలోనింపుకొని రెండు చేతులను చాచి నిలువునా యీదుకొంటూ నీటి మట్టానికి వచ్చేస్తాడు. ప్రతి ఒక్కరు రోజుకి ముప్పై, నలభైసార్లు మునిగి చిప్పలను సేకరించుకొని పడవలోని అధికార్లకు అంద జేస్తారు. రెండు వంతుల చిప్పలను ప్రభుత్వం తీసుకొని మూడోవంతు చిప్పలను ఏరినవాళ్ళకు కూలిగా యిస్తారు. అటు చూడండి.... ఎంతమంది మునిగి చిప్పలనుసేకరిస్తున్నారు?..'అన్నాడు కుమార్ గర్వంగా.

నేను చకితుడనై చూచాను నిర్భయంగా, ఎంతో వుత్సాహంలో, ఆనంద కేరింతలతో బెస్తలు మునిగి తేలుతున్నారు. ఈ విస్మయానంద భరితమైన పరిశ్రమను చూచుకొని మధ్యాన్నానికి ఒడ్డుచేరుకున్నాం. సాయంత్రం

ముత్తు బజార్‌కి వెళ్ళాం ముత్యాలబజార్లో జనం క్రిక్కిరిసి వున్నారు. ముత్యాల వ్యాపారులు ముత్యాలను కొనడం, అమ్మడం సాగుతోంది. ప్రక్కనేవున్న ముత్తెపు చిప్పలమ్మే స్థలానికి కూడ వెళ్ళాం ముత్తెపు చిప్పల బేరం తమాషా అయినది చిప్పలు చాల జోరుగానే అమ్ముతారు. అవి మనం కొని పగలకొట్టి చూస్తే, ఒక్కొక్కసారి వెలలేని ముత్యాలు చిక్కవచ్చు. మనంపెట్టిన ధరకు అటూ ఇటూ కొద్ది తేడా వెలగలిగిన ముత్యాలే వుండనూ వచ్చు, ఏమైనా అదృష్టంమీదనే ఆధారపడిన వ్యాపారమది చిప్పలను కొనమని నిర్బంధించాడు కుమార్ కొన్నాను. తూత్తుకుడికి బయల్దేరేముందు వసంత, 'నాకు ముత్యాల హారం తీసుకరానాన్నా!' అన్నది. ఏదో సముద్రతీరపు యిసుకలో గవ్వలేరే విధంగా అనుకుందేమో?

నేను కొన్న చిప్పల్లో మా అమ్మాయి గొంతెమ కోర్కెకి విరుద్ధంగా సన్నటి ముత్యాలు దొరికాయి, ముత్యాలహారం కోరిన అమ్మాయిని చిన్నచిన్న ముత్యాలలో తృప్తిపరచగలనా? అనుకుంటూ రైలెక్కాను.

నా మిత్రుడు కుమార్ తనకుటుంబానికి సంబంధించినట్లు చెప్పిన రెండు ముత్యాల సంఘటనలను నెమరు వేసుకుంటూ కూర్చున్నాను. రైలు దూరాన్ని తన వేగంలో చీల్చుకుంటూ ముందుకు పోతోంది.

'అమ్మా మన వూళ్ళో ముత్తెపు చిప్పల వేటజరిగి ఏన్నాళ్ళయింది.'

'కడసారి ముత్యాల చిప్పల వేట జరిగినప్పుడే నీవు పుట్టావు ఇరవై ఏడేళ్ళయింది.' అన్నం వడ్డిస్తూనే అన్నది రాజమ్మ.

'ఇరవై ఏడేళ్ళ తరువాత యిప్పుడు మన తూత్తుకుడిలో ముత్యాలవేట జరుగబోతుంటే నీవేమో నిరుత్సాహంగా మాట్లాడుతున్నా వెందుకమ్మా? ఒకప్పుడు మన పాండ్యదేశ సామంత రాజులు పోర్చుగీసువారికి కప్పం కట్టే బదులు మంచిముత్యాలను కుంచెళ్ళతో కొలిచి యిచ్చారనీ, ఫ్రెంచివాళ్ళు, డచ్చివాళ్లు తూత్తుకుడినుండి బస్తాలుగా ముత్యాలను కొల్ల గొట్టుకొని వెళ్ళారనీ చరిత్ర చెబుతున్నది. అంతే కాదు, విదేశరాజస్త్రీలు తూత్తుకుడి ఆణిముత్యాలతో తమ కంఠసీమను అలంకరించుకొని గర్వపడేవారట. ప్రపంచంలోనే మంచి కాంతివంతమైన గుండ్రని ఆణి ముత్యాలు ఒక్క మన పాండ్యనాడులోనే లభిస్తున్నాయని ప్రతీతి. ఇంతటి ప్రశంసకు పాత్రమైన పరిశ్రమ ఇన్నేళ్ళకు జరుగ బోతున్నందుకు నీవు ఆనంద పడలేవా అమ్మా!'

'చాలునాయనా. చాలు ముత్యాలవేట జరుగబోతున్నందుకు నన్నానందపడమంటున్నావా? ఇరవై ఏడేళ్ళక్రితం ఆఖరుగా జరిగిన ముత్యాలవేట తలచినంత మాత్రంలోనే నా గుండె నీరై....' వాక్యం ముగించక ముందే రాజమ్మ గొంతు బొంగురు పోయింది. కన్నీటి బిందువులు ముత్యాల సరాల్లాగ జలజలా రాలాయి.

పొంగిపొరలే దుఃఖాన్ని దిగమ్రింగుతూ, 'ముత్తూ! ఇన్నేళ్ళుగా నా మనస్సులో పొగలు కక్కుతున్న అగ్ని పర్వతంలోని జ్వాలారేఖలను పైకుబుక చేస్తున్నదీ ముత్యాలవేట. ఊఁ....అన్నం ఆరిపోతోంది భోంచేయి.' అన్నది బరువెక్కిన గుండెతో.

ఆరిపోతున్న రణాన్ని కెలికి గాయపరచినట్లయిందనుకొని బాధపడ్డ ముత్తుకుమార్ ఏదో తప్పుచేసిన వానిలా మౌనంలో భోంచేయసాగాడు.

కనుకొలకుల్లోనుండి కట్టలు త్రెంచుకొని ప్రవహిస్తున్న నీటిధారను పమిటచెంబుతో తుడుచుకొంటూ వంటింట్లోకి వెళ్ళింది రాజమ్మ.

♦ ♦ ♦

అంచుకనుపించని అఖండ జలసముద్రపు ప్రవాహంతో కట్టుమ్రానుకట్టుకొని యెదురీదిపోయి చేపలు పట్టే బెస్తకులంలో పుట్టింది రాజమ్మ. చిన్న వయస్సులోనే తల్లిని గోల్పోయిన రాజమ్మ తండ్రి వీరయ్య ఆదరణలో అల్లారు ముద్దుగా పెరిగింది. అమ్మానాన్నలు లేని అనాదుడైన మేనల్లుడు చిన్నయ్యకూడ వీరయ్య ఆదరాభిమానంలోనే పెద్దవాడయ్యాడు. రాజమ్మ చిన్నయ్యల బాల్యం ఒకేయింట ఒకేచోట అన్యోన్యంగా దినదినాభివృద్ధి పొందింది. రాజమ్మ చిన్నయ్యల వయస్సులో పోటీపడ్డ నేస్తబంధం అనురాగలతలుగా ప్రాకి పెనవేసుకొన్నాయి.

చిన్నయ్య తన మావయ్యతోవెళ్ళి చేపలుపట్టే పెద్దయ్యగా మారిపోయాడు. కవులు వర్ణించే కార్యకన్యలా నిండు యౌవనంలో మిసమిసలాడింది రాజమ్మ.

తెలిసీ తెలియని బాల్య పర్వనుండే రాజమ్మ చిన్నయ్యలు సముద్రతీరంలో యిసుకలో కట్టి ఆడుకున్న బొమ్మలయిండ్ల ఆటను, వారి భావి జీవితపు కోటగా కల్యాణ మన్న బంధంలో దృఢపరచాడు వీరయ్య.

ప్రేమైన జీవులమధ్య కాలచక్రపు మలుపులు క్షణాలుగా దొర్లిపోయాయి. అయిదు సంవత్సరాలు అయిదు యుగాలుగా అనుక్షణం నిరీక్షించిన వీరయ్య ఆశఫలించలేదు. బోసినోటి ముసిముసి నగవులు చిందే ముద్దు ముఖాన్ని చూడకముందే కండ్లు మూసాడు వీరయ్య.

♦ ♦ ♦

అది వేసవికాలపు ఆరంభదినాలు. ముత్యాల చిప్పల వేటకు అనువైన తరుణం. యథాప్రకారంగా ముత్యాల వేట సాగుతోంది. తమ ప్రాణాలను తృణ ప్రాయంగా భావించిన బెస్తలు శ్వాసంబిగబట్టి నడిసముద్రంలో మునిగి రాతిగుట్టలకంటుకొని వుండే ముత్తెపు చిప్పలను కోసుకొని, సముద్రపుటడుగు నుండి నిలువునా యీదుకొని బయటపడి తాము సేకరించిన చిప్పలను ప్రభుత్వపు అధికార్లకు అందజేసి వాళ్ళిచ్చే మూడోవంతు చిప్పలను కూలిగా పొంది రేవు ఒడ్డున్నే వాటిని అమ్ముకొని చీకటి పడ్డ తరువాత యిల్లు చేరుకొంటారు. ఈ ముత్యాల వేటలో చిన్నయ్యకు మంచి అనుభవముంది.

ఆదినం యిల్లుచేరిన చిన్నయ్య స్నానం, భోజనం ముగించుకొని నులకమంచంపై మేనువాల్చాడు. తన పంచజేరి కాళ్ళు వొత్తుతున్న రాజమ్మ కరస్పర్శకుమైమరచాడు చిన్నయ్య. వెన్నల వెలుగులో ప్రజ్వల్లే రాజమ్మ కళ్ళలోకి ఆశతో చూస్తూ, 'రాజీ! రేపటినుండి మరోచోట ముత్యాల చిప్పలను ఏరబోతున్నాం. అక్కడ చిప్పల్లో పెద్దపెద్ద ముత్యాలున్నాయట. రేపటి నుండి యేరే చిప్పలను అమ్మకుండా తెచ్చేస్తాను. వాటిలో దొరికే ముత్యాలలో నీకు నగలు చేయించాలనుకొంటున్నాను.' ఆమె ముఖంపై దోబూచులాడే ముంగురుల నుసరుతూ అన్నాడు చిన్నయ్య.

'ముత్యాల నగలు కావాలన్నానా బావా!' అని నవ్విన రాజమ్మ పలువరుస ఆ వెన్నల కాంతిలో పేర్చిన ముత్యాల సరంలాగ మెరిసాయి.

'అబ్బే, నీ వడిగానన్నానా? చాలా రోజులుగా నాలో నేనే అనుకొంటున్నాను, ఈ సారి ఎలాగైనా చేయాలి. అదీకాక నిండు చూలావివి...నీ కెన్నో కోర్కెలు...'




శ్రీ కృష్ణా ఐరన్ వర్క్స్.

తపాలు పెట్టె నెం. 103, మధురై.

మేము కట్టడములకు కావలసిన ఇనుము సామానులను తయారు చేయుదుము, స్ప్రింగు తలుపులు, కొంపొందు తలుపులు, క్రొత్త రకాల కిటికీలు, వెంటి లేటర్లు గ్రాదులు ఇనుము ట్రస్సులు, అద్దము కిటికీలు మొదలైన మా సామానులు ప్రసిద్ధిచెందినవి, 1925 సం॥ నుండి మునిసిపాలిటీలు, జిల్లా బోర్డులు, P. W. D. హైవేస్, పంచాయితీ బోర్డులు మొదలైన వారికి కావలసిన సామానులను తృప్తికరముగా సప్లయి చేయుచున్నాము.



టెలిగ్రామ్స్ : "IRONGATES"   ఫోను : 725

పొంగివచ్చే సిగ్గు తెరలను శ్రమతో మరుగుపరుస్తూ 'నీవేమో ఉత్సాహంతో చిప్పలవేటకు వెళ్ళిపోతావుగాని. నీవు యింటికి వచ్చేంతవరకు నామనస్సెంత మధనపడు తుందో నీ కేం తెలుసు ?' అన్నది రాజమ్మ.

'నిజమే. ఇప్పట్లో నిన్ను ఒంటరిగా విడిచివెళ్ళడం నాకూయిష్టంలేదు. అయినా యీ ముత్యాలవేట ముగిసే వరకు తీరదుగా.'

'ఒంటరిగా వుండడం గురించి కాదు నాబాధ నీవు భద్రంగా యిల్లు చేరాలని దేవుళ్ళకు మొక్కుతుంటాను. నీ విల్లు చేరేవరకు నాకేమో భయంగానే వుంటుంది.'

'వెర్రిదానా ! భయమెందుకు? ఇదేం కొత్త పనా? చిన్నప్పటినుండి అలవాటైందే కదూ భయమెందుకు?'

'పోనీ....యింట్లో వేరే దిక్కులేదు. నాకోసం కొన్నాళ్ళు పని మానెయ్యరాదూ?'

'అలాగంటే మానేస్తాను. కాని రేపు ఒక్కరోజు మాత్రం వెళ్లొస్తాను. నీ అదృష్టానికి మంచి ఆణి ముత్యాలే దొరుకుతాయి.'

'నాఅదృష్టమేముంది ప్రత్యేకంగా!'

'మన అదృష్టం...కాకుంటే పుట్టబోయే పిల్లాడి అదృష్టమను కొందాం!'

రాజమ్మ చెక్కిళ్ళు యెర్రబారాయి, వెన్నెలొలికెస్తుం డిన చంద్రుడు మబ్బుల్లో దాగాడు.

తెల్లారింది. రాజమ్మ అందించిన చద్దన్నం మూటతో చిన్నయ్య ముత్యాలరేవుకి బయల్దేరాడు చిన్నయ్య వీధి మలుపు తిరిగేంతవరకు వాకిట్లో నిల్చున్న రాజమ్మ బరువుగా నిట్టూర్చింది.

ఆరోజు మధ్యాన్నమే రాజమ్మకు ప్రసవవేదనలు ఆరంభించాయి. పొరుగింటావిడ శ్రమ తీసుకొని సహాక రించింది సాయంత్రం అయిదు గంటలకు మగశిశువును ప్రసవించింది. రాజమ్మ ముందుగా ఈ సంతోషవార్తను భర్తకు చెప్పిపంపమని ప్రాధేయ పడిందా మాతృ హృద యం,

పాపం! ముత్యాల రేవులో జరిగిన ఘటన రాజమ్మ కేం తెలుసు ?...జరిగిందేదో జరిగిపోయింది. చాలాసేపు నీళ్ళలో మునిగివుండిన చిన్నయ్య శ్వాసం బిగబట్టలేక ప్రాణాలు వదిలాడు.

చిన్నయ్య మరణవార్తవిని మూర్ఛిల్లిన రాజమ్మ మూడురోజుల తర్వాతగాని తేరుకోలేక పోయింది. భర్త అకాల మరణానికా లేత హృదయం తెగిపోయిన గాలి పటంలా తటపటాయించింది. చీకటిక్రమ్ముకొన్న తన జీవితానికి వెలుగు చుక్కగా ప్రజ్వరిల్లుతున్న చిన్నయ్య ప్రతి బింబాన్ని చూచి తన్నుతానే ఓదార్చుకో గల్గింది. అఖాతమైన జీవిత సాగరంలో పట్టుకొమ్మగా ప్రసాదించబడ్డ బిడ్డకు 'ముత్తుకుమార్' అని పేరుపెట్టు కొని మురిసిపోయింది. ఆపసికూనకొరకే ఆమె ఉచ్ఛ్వాస చేనిశ్వాసలు యగల్గిందని చెప్పక తప్పదు.

రాజమ్మ ముత్తుకుమార్ని తమ కుల వృత్తిలో ప్రవేశపెట్టనీయక చదువు సంధ్యల్లోనే ఆసక్తిని కలుగ జేస్తూ, సముద్రం వైపు తేరిపార నివ్వకుండా కట్టుబాట్లతో పెంచసాగింది, ఆనంద భరితమైన జీవితాన్ని తన పొట్ట బెట్టుకున్న సముద్రంపై తీరని ద్వేషం కల్గిందామెకు.

చిన్నతనంలో తల్లిమాట జవదాటని ముత్తుకుమార్ ఎదిగేకొద్దీ తనతోటి వారి స్థితిగతులను, తమ కులవృత్తి మున్నగు విషయాలను గ్రహించగలిగాడు. నిండు గర్వంలో ఉవ్వెత్తుగా లేచే నీలి కెరటాలు, భయమెరు గని ముత్తు హృదయంలో క్రొత్త మార్పులను కల్గిం చాయి. సముద్రాన్నే జీవాధారంగా చేసుకొన్న బెస్త కులంలో పుట్టిన తనను, తల్లి మమకారం అన్నపేరుతో పిరికి వాడ్నిగా తయారు చేస్తుందేమోనని శకించాడు. తల్లికి తెలీయకుండా తన యీడు స్నేహితులతో కలసి సముద్ర తీరానికి వెళ్ళడం, తిన్నగా పడవ షికార్లు చేయ డం, చేపలు పట్టడం మున్నగు పనుల్లో కొంత అను భవం కల్గించుకొన్నాడు. ముత్తుకుమార్ నడవడికలో ఏర్పడ్డ నూతన చైతన్యం ఆ మాతృ హదయాన్ని కం పింప జేసింది.

స్కూల్ ఫైనల్ చదువుతో విరమించుకున్న ముత్తు కుమార్ తల్లి మందలింపులతో చేపలవేట చాలించి వుద్యోగ వేటలో దిగాడు. స్టీమర్లో మంచిపనే దొరికింది నీల కెడలి కెరటాలను అవలీలగా చీల్చుకొని వెళ్ళే నావ

మీ ఆభరణములకు
అతి శ్రేష్ఠమయినది
సవరన్ మార్కు
REGISTERED-TRADE-MARK
No:115228
పారిస్ వజ్రములు
వివరములకు
PARIS DIAMOND WORKS
207.D.BIG BAZAR
TIRUCHIRAPALLI—8
పారిస్ డైమండ్ వర్క్సు
207.డి.బిగ్ బజారు
తిరుచురాపల్లి—8

లోనే అతని అవయం లీనమై వుండింది. కాని రాజమ్మ అందు కెంత మాత్రం ఇష్టపడలేదు! మాతృప్రేమ ముత్తు ఆశయాన్ని అడుగంట జేసింది. చేతికందిన ఉద్యోగాన్ని జారవిడుచుకొని విధిలేక ఒక ఆఫీస్‌లో గుమాస్తాగా చేరాడు.

త్వరలోనే ముత్తుకు పెండ్లి చేసి తనభారం దించుకోవాలని అన్నివిధాలా ప్రయత్నించింది రాజమ్మ. కాని తల్లికి సరైన సమాధాన మివ్వకుండా కాలయాపన చేశాడు. ముత్తు కుమార్.

'అమ్మా! మజ్జిగ!....' అన్న ముత్తు పిలుపుకు ఇంత వరకు రాజమ్మ హృదయఫలకంపై వర్షించిన తలంపుల తుంపరలు నిలిచిపోయాయి.

♦ ♦ ♦

తూత్తుకుడి రేవులో ప్రభుత్వపు పెద్ద వోడ లంగరు వేసింది. వూళ్లోని ప్రజలందరూ నావను చూడ్డానికి విరగబడ్డారు. వాళ్ళందరికంటే ముందుగా హాజరయ్యాడు ముత్తుకుమార్. నావను తదేక దీక్షతో చూస్తున్న సమయంలో పరిచయమైంది కనకం. పేరుకు తగ్గ పసిడి ఛాయతో, చెంపకు చారడేసి కండ్లతో నవనాగరీకపు అలంకరణలతో వసంత కాలపు వన్నెలను తనలో యిముడ్చుకొని వున్న కలువకంటి చూపుల్లో తనహృదయాన్ని జారవిడుచుకున్నాడు. ముత్తుకుమార్.

♦ ♦ ♦

ప్రశాంతమైన సాయం సమయం, సముద్రపుటంచు నుండి మెల్ల మెల్లగా నీలాకాశంలోకి ప్రాకుతున్నాడు. శరచ్చంద్రుడు. సాగర తరంగాలపై నాట్యం చేస్తున్న చల్లని పిల్ల వాయువు ఇసుక దిబ్బపై కూర్చున్న ప్రయాణ జీవుల భావాలను ఉద్రేకపరుస్తున్నది.

'కనకం. మన పెళ్లివిషయం నానతో చెప్పావా? ఏమన్నారాయన?'

'నా మాటకు అడ్డుచెప్పడు మా నాన్న. అయినా తనకు కాబోయే అల్లుడు గురించి కలలు కంటున్నాడు.'

'అల్లుడ్ని గురించి కలలు కంటున్నాడా? ఏమని'? తన విస్మయానిధ్వనిలో వ్యక్తీకరించాడు. ముత్తుకుమార్.

'కాబోయే అల్లుడు సముద్ర....'

అర్థోక్తిలోనే అడ్డు తగిలి, ఉ:సముద్రంలో ఏం చేయాలి?....చెప్పు త్వరగా చెప్పు....సముద్రంలో దూకమన్నా జంకను ' అన్నాడు ఆవేశంలో ముత్తు.

అతని అవసరానికి నవ్వుతూ కనకం, 'అవసరపడకుండా నన్ను చెప్పనిస్తేగా? సముద్ర సంబంధమైన

అన్ని పరిశ్రమల్లోను ఆరితేరిన వారికే నన్నివ్వాలని ఆయన ఆశిస్తున్నారు. అంటే తమ కులవృత్తిపై మా నాన్నకు మక్కువ 'నీవు సముద్రంలో దూకితే నాగతేం కాను?' అన్నది. చిరుకోపాన్ని తనముఖంలో స్ఫురింప జేస్తూ.

'అంతేనా?....నేను గుమస్తాగిరీ చేయడం మీ నాన్నకు యిష్టంలేదు. కులవృత్తి మా అమ్మకు ఇష్టం లేదు. మధ్య నేనేం చెయ్యగలను? నీ కొరకు జలగర్భం నుండి మణులను, ముత్యాలను ఏరి తెమ్మన్నా తీసుక రాగలను. కానీ....' పైన ముగించలేక బరువుగా నిట్టూర్చాడు ముత్తు.

ఇరవై ఏడేళ్ళ అనంతరం తూత్తుకుడి సముద్రంలో ముత్తెపు చిప్పల వేట ఆరంభమైంది. స్వదేశం నుండే గాక విదేశాలనుండి కూడా ముత్యాల వ్యాపారులు తూత్తుకుడిలో ముకాంవేశారు. పాండ్యనాడు పరిశ్రమల్లో పేరొందిన ముత్యాల వేట చూచే నిమిత్తం, ముత్యాల చిప్పలుకొని తమతమ అదృష్టాలను పరీక్షించుకొనే వాంఛలోనుతండోప తండాలుగా ప్రజలు ప్రోగయ్యారు.

ఆ దినం వేచ్ఛగా కనకాన్ని కలుసుకున్న ముత్తుకుమార్, 'కనకం; ముత్వాల రేవుకు వెళ్ళావా ఎలా గుంది?' అని ప్రశ్నించాడు.

'రోజూ వెళ్ళాలనుకుంటున్నాను, గాని వెళ్ళలేదు. రేపు మా నాన్నతో వెళ్ళాలి; నీవూ వస్తావా?'

'ఆహా, వస్తాను. నా కొరకు రేవు ఒడ్డున కాచుకొని వుంటావా. తప్పకుండా వస్తాను?'

'తప్పకుండాను' అని ధృఢపర్చింది కనకం.

మరునాటి సాయంత్రం కనకం తన తండ్రితో ముత్యాల రేవుకు వెళ్ళింది. రేవంతా ఒక్కసారి తిరిగి

ENJOY BY SMOKING THE GREAT
3 HORSE BEEDIES

శ్రేష్టమైన పొగాకుతో తయారు కాబడిన 3 గుఱ్ఱముల బీడీలను కాలాది కాలమునుంచి వాడుతూ, మన ఆంధ్రరాష్ట్రములో లక్షలాది ప్రజలు ఆనందమును, ఉత్సాహమును పొందుచున్నారు. శ్రేష్టమైన 3 గుఱ్ఱముల బీడీలతో ఇతర రకముల బీడీలను, విలువైన సిగరెట్లను పరీక్షించిన వాటి విలువ మీకే తెలియును.

DEALERS:—
C. MOHAMED EBRAHIM & SON.
VIZAINAGARAM CITY.

Mfgd: By: 3 HORSE BEEDI COMPANY, VIZAINAGARAM CITY
Telegram: THREE HORSE - Telephone: 6

మీ ఆభరణములకు
విలువనూ
ప్రకాశమునూ
యిచ్చేవి




బిజిలి
స్టార్
వజ్రములు

నమ్మకమైన సీలుచేసిన ప్యాకెట్లులో దొరకును

తయారుచేయువారు

L.P.R. MURUGESAN CHETTY & CO
BIJILI STAR DIAMONDS
435. BIG BAZAR ST
TIRUCHIRAPALLI-8

ఎల్.పి.ఆర్.మురుగేశన్‌చెట్టి&కో
బిజిలి స్టార్ డైమండ్స్
435. బిగ్‌బజార్‌స్ట్రీట్
తిరుచిరాపల్లి-8

చూచి తండ్రీ కూతురు ఒకచోట కూర్చున్నారు. కనకం తండ్రి కూడా ఒకప్పుడు ముత్యాల చిప్పలు ఆరితేరిన మనిషి. తనకాలంలో జరిగిన ముత్యాల ఏరకాన్ని గురించి కథలుగా వర్ణించనారంభించాడు. కానీ కనకం ధ్యాసంతా ముత్తుకుమార్ నిరీక్షణలోనే లీనమైంది. ఎంత సేపు కాచుకున్నా ముత్తుకుమార్ వచ్చేటట్లు కనిపంచ లేదు. ఒకవైపు కోపం, మరోవైపు తాపం ముంచుకొచ్చి బాధపడింది. కనకం ఇక ముత్తు రాకకు ఎదురుచూచి లాభం లేదనుకొని తండ్రితో బయల్దేరుబోతున్న సమయంలో చిప్పల సేకరణలతో పెద్దపడవ ఒడ్డుచేరింది. దాన్నిచూడాలన్న కుతూహలంతో తండ్రీ కూతురు నిలబడ్డారు. ఒడ్డుచేరిన పడవ నుండి ముత్యాల చిప్పలు ఏరేవాళ్ళు తమ తమ భాగాలను అమ్ముకోవడానికి జనసమూహంలో పడ్డారు,

ఒక బెస్త కనకాన్ని సమీపించి, 'అమ్మా! చిప్ప కొంటారా?' అని ప్రాధేయ పూర్వకంగా అడిగాను.

'వంద ఎంతకిస్తావు?'

'బేరం చేస్తారెందుకమా? మా ఆలు బిడ్డల్ని మరచిపోయి మా ప్రాణాల్ని ల్మక్ష్యపెట్టి కనడు సముద్రంలో మునిగి మీ కొరకని ముత్యాల చిప్పలను తెస్తున్నాం. వాటిని కొని వెలలేని ముత్యాలను పొందే మీరు బేరానికి దిగితే ఎలాగమ్మా!'

'ఏ మాటలకేం గాని, ముత్యాలు లేకుంటే మాకేగా నష్టం?'

'నష్టం మీకు గాదు మాకే! చావు బ్రతుకుల్లో కడలి కెరటాల్లో మునిగి తేలే మాకు దొరికేది పొట్ట కూటికేగా? మీకు దొరికేదో ఆణి ముత్యాలు!'

'నాన్నా! ఈ చిప్పల విషయం నాకు తెలీదు. నీవే బాగా చూచికొను.' ఆ చిప్పలమ్మే వానితో వాదించలేక తండ్రి సహాయాన్ని కోరింది కనకం.

'అయ్యా అమ్మాయిగారు చిప్పలను కొనడానికి సందేహిస్తున్నారు. బేరం గీరం ఏమీ వద్దు. ఈ ముత్యాల చిప్పలన్నిటినీ తీసుకొని వీటికి బదులు మీ కనకాన్ని నాకివ్వండి.'

కనకం, ఆమే తండ్రీ ఆ మాటలకు నిర్ఘాంత పోయారు. అతన్ని వురిమి చూసారు. హద్దుమీరి మాట్లాడుతున్న అతని పైకి కోపంతో లంగించబోయాడు కనకం తండ్రి.

'అయ్యా ఆగండి. ఈ సవర్ణ విగ్రహాన్ని పొందటానికని నేనెంత కష్టపడి సముద్రంలో మునిగి ముత్యాల చిప్పలను తెస్తే మీ రెందుకింత కోపంతో చుర చుర చూస్తారు?' అని అంటూ వూడిపడబోతున్న బుర్ర మీసాలనొకచేత్తో తీసుకొని మరోచేతో తలకు చుట్టుకున్న గుడ్డను తీసి పారేశాడు.

కోపంతో కళ్ళెర్ర జేసిన కనక, ఆమె తండ్రి భ్రాంతితో, 'ఎవరు? ముత్తుకుమార్!....' అన్నారు ఏకస్థాయిలో.

'ముత్తూ! నా కనకం కొరకు నీవే స్వయంగా ముత్యాల నేరుకొని వచ్చావా? భేష్, భేష్. సముద్రంలో మునిగి ముత్యాల చిప్పలను ఏరే పనికూడా తెలుసా నీకు?' అని అంటూ, కనకం వైపు తిరిగి, 'ఏం కనకం? ఈ నాటకానికి నీవేనా సూత్రధారిణివి?' అన్నాడు తన సంతోషాన్ని ధ్వనిలో వ్యక్తీకరిస్తూ,

సంతోషాశ్చర్య తరంగాల్లో మునిగి తేల్తున్న కనకం తేరుకొని, 'లేదునాన్నా! నాకేమీ తెలీదు. ముత్తుకుమార్‌కి ముత్యాల మునుగుడు తెలుసని నాకింతవరకూ తెలీదు. నాన్నా!' అనగల్గింది.

'నిజమేనండీ మామగారూ! కనకానికి తెలీదు. కుల వృత్తిలో తేరినవాడికే మీ అమ్మాయిని యిస్తారని చెప్పారట, అందుకని ఆరునెలలుగా ఈ పరిశ్రమలో దిగి బాగా నేర్చుకున్నాను. నాసామర్థ్యాలను సమక్షంలోనే చూచారు. నేను ఏరితెచ్చిన ముత్యాలను కల్యాణ శుల్కంగా స్వీకరించాలని మామగారికి మనవి చేస్తున్నాను' అన్నాడు ధైర్యంగానే ముత్తు.

'బలేవాడివే! ఇంటికివెళ్ళి మీ అమ్మతో మాట్లాడుదాం పద.' కాబోయే అల్లుడు శక్తిసామర్థ్యాలకు లోలోన గర్వపడుతూ అన్నాడాయన.

లజ్జా భారంతో బరువెక్కిన రెప్పలను క్రిందికి వాల్చి, మందహాసవదనంలో వాళ్ళిద్దర్నీ కనుకరించి నడిచింది కనకం.

'అమ్మా! మీ కుమారుడు ముత్యాల నాశించి వెళ్ళలేదు. ముత్యాల నేరుకొని దానికి యీడుగా మా కనకాన్ని పొందాడు. ఈ దినంనుండి మా అమ్మాయి కనకం మీ యింటి కోడలు!' అనిచెప్పి ముత్తుకుమార్, కనకం చేతులను కలిపి రాజమ్మకు అప్పగించాడు కనకం తండ్రి.

కనకం పెదవులపై చిందులాడిన ముత్యాలొలికే నగవు ముత్తుకుమార్‌ని సమ్మోహిత పరచింది.


టి. మారిముత్తు హాండ్‌లూమ్ వీవింగ్ ఫ్యాక్టరి.

అహింసాపురం, సెల్లూరు, మధురై.




మా చేనత శాలలలో అనుభవజ్ఞులైన పనివారితో, స్వంత మగ్గాలులో తయారైన నవనాగరికమైన, కంటికి ఇంపైన డిజైనులలో శుభ్రమైన ఉతుకుతో గట్టి నేతతో గ్యారంటి రంగులతో అఖిలభారత వ్యాపారులచే పొగడబడిన ''శివాజీ''తువ్వాల్లు, తుండుగుడ్డలు, దుప్పట్లు, కేన్వాస్, కర్చిప్, మొదలైనవి సరసమైన వెలలకు దొరకును.

మీ అభిమాని

టి. మారిముత్తు.

N B బైట ఊరు నుంచి వచ్చే ఆర్డర్లను వెను వెంటనే గమనించి పంపబడును.